ప్రజా సంక్షేమాన్ని విస్మరించిన కాంగ్రెస్

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



పటేల్‌నగర్‌లో సమస్యలు తెలుసుకుంటున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

అంబర్‌పేట: రాష్ట్రంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలు పారదర్శకంగా అమలు కావడం లేదని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి విమర్శించారు. బుధవారం ప్రజా సమస్యలపై అంబర్‌పేట నియోజకవర్గంలో పలు ప్రాంతాల్లో అధికారులతో కలిసి పర్యటించారు. పటేల్‌నగర్, ప్రేమ్‌నగర్, మల్లికార్జున్‌నగర్, సోమసుందర్‌నగర్ ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించారు. ప్రజలను వారు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వీధి లైట్లు, రేషన్‌కార్డులు, డబుల్‌బెడ్‌రూమ్ ఇండ్లు, కళ్యాణలక్ష్మితో పాటు తులం బంగారం హామీ ఏమైందని ఆయన ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. మహిళలకు ఎలక్ట్రిక్ స్కూటీల హామీ ఏమైందని ఆయన ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. రియల్‌ఎస్టేట్ సంస్థల వద్ద వసూళ్లపై ఉన్న శ్రద్ధ ప్రజా సంక్షేమంపై లేదని కేంద్ర మంత్రి ఆరోపించారు. హైదరాబాద్ నగరంలో కనీస మౌలిక సమస్యలను పట్టించుకునే నాథుడే లేడని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వివిధ విభాగాల అధికారులు, బీజేపీ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణ అందరి బాధ్యత

ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ ఇన్‌స్పెక్టర్ రాంచందర్



విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలు వివరిస్తున్న ఇన్‌స్పెక్టర్ రాంచందర్

నల్లకుంట: రోడ్డు ప్రమాదాల నివారణకు కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త ట్రాఫిక్ రూల్స్ ఈ నెల 1వ తేదీ నుంచి అమలులోకి వచ్చాయని బేగంపేట ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ ఇన్‌స్పెక్టర్ వి.రాంచందర్ తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, అందుకు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. బేగంపేట ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో బుధవారం నల్లకుంటలోని దుర్గాబాయి దేశ్‌ముఖ్ ఆస్పత్రి రీసెర్చ్ సెంటర్ (డీడీహెచ్‌ఆర్‌సీ) ఆడిటోరియంలో దుర్గాబాయి దేశ్‌ముఖ్ ఫిజియోథెరపీ, నర్సింగ్ కళాశాలల విద్యార్థులకు 'రోడ్డు ప్రమాదాలు–నివారణ' అనే అంశంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ రాంచందర్ మాట్లాడుతూ... ట్రాఫిక్ కూడళ్ల వద్ద రెడ్ సిగ్నల్ పడినప్పుడు వాహనదారులు ఓపికగా తమ వాహనాలను ఆపాలని, తొందరపడి ముందుకు సాగితే ప్రమాదాలు సంభవిస్తాయని హెచ్చరించారు. హైదరాబాద్ నగరంలో 2022లో 65,413, గతేడాది(2023)లో 42,261 మందిపై సిగ్నల్ జంపింగ్ కేసులు నమోదైనట్లు ఆయన వివరించారు. అలాగే డ్రైవింగ్ లైసెన్స్‌లు లేకుండా వాహనాలు నడిపిన ఘటనలో 2023లో 6,173 మంది, 2024లో ఇప్పటి వరకు 3,500 మందిపై కేసులు నమోదు చేసి బేగంపేట ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్‌లో కౌన్సిలింగ్ ఇచ్చామని చెప్పారు. డీడీసీవోపీ ప్రిన్సిపాల్ శ్రావ్య స్పందన, డీడీసీవోఎన్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఛాయానందిని, ఏఎంఎస్ ఎస్‌వోఎన్ ప్రిన్సిపాల్ సిపుల్, ట్రాఫిక్ ఎస్సైలు దేవదాస్, అయాన్, హెడ్ కానిస్టేబుల్ కృష్ణ, హీరో మోటార్స్ శ్రావణ్ కుమార్, నర్సింగ్ కళాశాల, ఫిజియోథెరపీ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: మాత వాకర్స్ క్లబ్ నల్లకుంట అచ్చుతరెడ్డి మార్గ్ రెసిడెన్స్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 11వ తేదీ గురువారం ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు సంస్థ అధ్యక్షుడు డాక్టర్ వై.మురళీధరుడు తెలిపారు. విద్యానగర్‌లోని రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంక్ ఎదురుగా అచ్చుత్‌రెడ్డి కాంప్లెక్స్‌లో నిర్వహించనున్నారు. హార్ట్, డెంటల్, కంటి, బీపీ, షుగర్, ఈసీజీ, ఆర్థోపెడిక్ తదితర వైద్య పరీక్షలను నిర్వహించనున్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, సుధాకర్ పైప్స్ ఎండీ అనంతుల దయాకర్, వాకర్స్ ఇంటర్నేషనల్ మాజీ అధ్యక్షుడు నాగభూషణం, ముఠా జైసింహ, అల్లాడి శ్రీనివాస్, జైహింద్, లింగ ప్రకాష్ తదితరులు పాల్గొననున్నారు.

ప్రతిభా పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

కాచిగూడ: మున్నూరుకాపు విద్యార్థినీవిద్యార్థుల నుంచి 2023–24వ సంవత్సరానికి గాను ప్రతిభా పురస్కారాలకు దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు మున్నూరుకాపు విద్యార్థి వసతి గృహం ట్రస్ట్‌బోర్డు చైర్మన్ ప్రొఫెసర్ మ్యాడం వెంకట్‌రావు తెలిపారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్‌మీడియట్‌లో 80 శాతానికి పైగా మార్కులు సాధించిన ప్రతిభావంతులైన విద్యార్థినీవిద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తులను ఈ నెల 31వ తేదీ లోగా కాచిగూడలోని మున్నూరుకాపు భవన్ ట్రస్ట్ బోర్డు కార్యాలయంలో అందజేయాలని ఆయన కోరారు. వివరాలకు సెల్: 9491627404 సంప్రదించాలన్నారు.

సౌకర్యాల కల్పనకు పటిష్ట చర్యలు

రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్



ఎంపీ డాక్టర్ లక్ష్మణ్‌కు వినతి పత్రం అందజేస్తున్న రోటరీ కాలనీవాసులు

కవాడిగూడ: కవాడిగూడ డివిజన్ రోటరీ కాలనీలో కనీస సౌకర్యాల కల్పనకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకుంటామని రాజ్యసభ సభ్యుడు, ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కె.లక్ష్మణ్ వెల్లడించారు. తమ బస్తీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఎంపీ డాక్టర్ లక్ష్మణ్‌కు బస్తీవాసులు ఫిర్యాదు చేశారు. దీంతో ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్, కవాడిగూడ కార్పొరేటర్ జి.రచనశ్రీ బుధవారం కవాడిగూడ డివిజన్‌లోని రోటరీ కాలనీలో పాదయాత్ర చేసి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్నారు. కొంత కాలంగా మంచినీటి సమస్యతో బాధపడుతున్నామని, మంచినీటి పైప్‌లైన్ ఏర్పాటు చేసిన తరువాత సీసీ రోడ్డు ఏర్పాటు చేయాలని స్థానికులు వారిని కోరారు. కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులు చేపట్టాలని కోరారు. ఈ సందర్భంగా రోటరీ కాలనీలో ఏర్పాటు చేసిన సమావేశంలో రోటరీ కాలనీ బస్తీ అధ్యక్షుడు బీజేపీ నేత బండారి యాదగిరి ఆధ్వర్యంలో ఎంపీ డాక్టర్ లక్ష్మణ్, కార్పొరేటర్ రచనశ్రీకి బస్తీ సమస్యలను పరిష్కరించాలని వినతి పత్రం అందజేశారు. బీజేపీ రాష్ట్ర నాయకులు జి. వెంకటేష్, రంగరాజగౌడ్, పరిమళ్‌కుమార్, డివిజన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎం.సి. మహేందర్‌బాబు, ఎ. ప్రభాకర్ గంగపుత్ర, కేశవరాజు, రోటరీ కాలనీ బస్తీ అధ్యక్షుడు బండారి యాదగిరి, బస్తీ సీనియర్ నాయకులు ఇట్టి మోహన్, రమేష్, మల్లేష్, ఇటి మల్లేష్, రాకేష్, తుకారం తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టులు, విద్యార్థులపై దాడిని ఖండిస్తున్నాం



విద్యానగర్‌లో మాట్లాడుతున్న వంగపల్లి శ్రీనివాస్‌మాదిగ

ముషీరాబాద్: ఉస్మానియా యూనివర్సిటీలో డీఎస్సీ గ్రూప్–2 పరీక్ష వాయిదా వేయాలని పలు విద్యార్థి సంఘాలు నిరసన చేస్తుంటే నిరసన చేస్తున్న విద్యార్థులపై, కార్యక్రమాన్ని కవర్ చేసేందుకు వచ్చిన జర్నలిస్టులపై పోలీసులు చేసిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్‌మాదిగ హెచ్చరించారు. విద్యానగర్‌లోని ఎమ్మార్పీఎస్ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రేవంత్ ప్రజాపాలన ఆంధ్ర పరిపాలనను తలపిస్తోందన్నారు. ఉస్మానియా యూనివర్సిటీలో పోలీసుల రాజ్యం నడుస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు ప్రతి పౌరుడికి ఉందని, ఆ హక్కుతోనే ఈ రోజు తెలంగాణ రాష్ట్రాన్ని సాధించామని అన్నారు. గ్రూప్–2 పరీక్ష, డీఎస్సీ పరీక్షను వాయిదా వేయాలని కోరుతూ పది రోజులుగా వేల మంది విద్యార్థులు ఉస్మానియా యూనివర్సిటీలో నిరసన వ్యక్తం చేస్తున్నారన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో ఆంధ్ర పాలకులు విద్యార్థులను ఎలా అయితే అణిచివేశారో మళ్లీ ఆనాటి ఘటనలు గుర్తు చేసే విధంగా ప్రస్తుత రేవంత్‌రెడ్డి ప్రభుత్వం వ్యవహరిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉస్మానియా యూనివర్సిటీలో ప్రస్తుతం పనిచేస్తున్న సర్కిల్ ఇన్‌స్పెక్టర్లను ప్రభుత్వం తక్షణమే సస్పెండ్ చేయాలన్నారు. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కోర్ కమిటీ సభ్యులు బంగారు శ్రీనివాస్, ఎమ్మెస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కొల్లూరు వెంకట్, వర్కింగ్ ప్రెసిడెంట్ వరిగడ్డి చందు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిరుమల్లేష్, ఆల్ యూనివర్సిటీ ప్రెసిడెంట్ జీవన్, ఓయూ ప్రెసిడెంట్ నాగరాజ్, హైదరాబాద్ ప్రెసిడెంట్ సురేష్, మనీ, ఫనీ, భానుప్రసాద్, ప్రవీణ్ తదితరులున్నారు.

కలుషిత నీరు.. డ్రైనేజీ సమస్యలకు...

శాశ్వత పరిష్కారం చూపాలి

- బస్తీల్లో ఆయా సమస్యలపై స్పెషల్ ఫోకస్
- మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యమివ్వాలి
- ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్



గంగపుత్ర కాలనీలో డ్రైనేజీ పైప్‌లైన్ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

ముషీరాబాద్: బస్తీల్లో కలుషిత నీటి సరఫరా, డ్రైనేజీ లీకేజీ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ జలమండలి అధికారులను ఆదేశించారు. ముషీరాబాద్ డివిజన్ గంగపుత్ర కాలనీలో చేపడుతున్న డ్రైనేజీ పైప్‌లైన్ నిర్మాణ పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం ఆయన అడిక్‌మెట్ డివిజన్ కట్టబావి, అడిక్‌మెంట్‌లలో పర్యటించి స్థానికు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్నారు. కట్టబావి బస్తీల్లో కలుషిత నీటి సరఫరాతో ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు ఫిర్యాదు చేయగా వెంటనే పరిష్కారం చూపాలని జలమండలి మేనేజర్‌ను ఆదేశించారు.

- గంగపుత్ర కాలనీలో గత 25 సంవత్సరాలుగా ఎదురవుతున్న డ్రైనేజీ లీకేజీ సమస్య పరిష్కారం కోసం పైప్‌లైన్ నిర్మాణ పనులు చేపడుతున్నట్లు తెలిపారు.
- బస్తీల్లో మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు పెద్ద ఎత్తున అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. గతంలో ఎమ్మెల్యే చేయని విధంగా నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకువెళ్తున్నామని అన్నారు.
- ఇటీవల డ్రైనేజీ సమస్యల పరిష్కారం కోసం పెద్ద ఎత్తున నిధులు వెచ్చించి పనులను చేపడుతున్నట్లు ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముఠా గోపాల్ స్పష్టం చేశారు.
- కార్యక్రమంలో జలమండలి మేనేజర్ శివ, బీఆర్ఎస్ పార్టీ యూత్ విభాగం నేత ముఠా జైసింహ, బి.శ్రీనివాస్‌రెడ్డి, ఆకుల అరుణ్, ముచ్చకుర్తి ప్రభాకర్, శ్రీధర్‌రెడ్డి, దీన్‌దయాల్‌రెడ్డి, వి.సుధాకర్‌గుప్తా, శ్యామ్ సుందర్, నేత శ్రీనివాస్, మాధవ్, సయ్యద్ అస్లాం, ఎయిర్‌టెల్ రాజు, భాస్కర్ నేత, అబ్బు తదితరులు పాల్గొన్నారు.



సమస్యలను ఎమ్మెల్యేకు వివరిస్తున్న స్థానికులు

ఈటలకు సత్కారం



ఎంపీ ఈటలను సత్కరిస్తున్న గీతామూర్తి

కాచిగూడ: మల్కాజిగిరి బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్‌ను బీజేపీ మహిళా మోర్చ రాష్ట్ర మాజీ అధ్యక్షురాలు, పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు కె.గీతామూర్తి బుధవారం ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సత్కరించి అభినందనలు తెలియజేశారు. భవిష్యత్‌లో ఈటల రాజేందర్ మరింత ఉన్నత స్థాయికి చేరుకుని ప్రజలకు సేవలు అందించాలని ఆకాంక్షించారు. కేంద్రంలోని నరేంద్రమోదీ బీజేపీ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా మహిళా నేతలు కృషి చేయాలని ఈ సందర్భంగా ఈటల రాజేందర్ సూచించారు.

ఆస్తిపై కన్నేసి.. బ్లాక్‌మెయిలింగ్

సీపీకి ఫిర్యాదు చేసిన మహిళ



ఉజ్మా ఫాతిమా

కాచిగూడ: తమ ఆస్తిపై కన్నేసి తప్పుడు ఫిర్యాదులు చేస్తూ ఏడు లక్షలు తమకిస్తే ఫిర్యాదులు వాపసు తీసుకుంటామని బ్లాక్ మెయిలింగ్‌కు పాల్పడుతున్న వారిపై చట్టరీత్యా తగు చర్యలు తీసుకోవాలని కాచిగూడ, సుందర్‌నగర్‌కు చెందిన ఉజ్మా ఫాతిమా నగర పోలీస్ కమిషనర్‌కు విజ్ఞప్తి చేసింది. సుందర్‌నగర్‌లో బుధవారం ఆమె మాట్లాడుతూ... సుందర్‌నగర్‌కు చెందిన స్వామి వద్ద 69 చదరపు గజాలు, యాసిన్ టెంట్ హౌస్ యజమాని వద్ద 43 చదరపు గజాల స్థలాన్ని కొనుగోలు చేశామని తెలిపారు. అయితే తాము కొనుగోలు చేసిన స్థలంలో కొద్దిభాగం రోడ్డు వైడనింగ్‌లో పోతుందని, దీనికి గాను జీహెచ్‌ఎంసీ తమకు నష్టపరిహారం చెల్లించనుందన్నారు. దీంతో తమ ఆస్తిపై స్థానికంగా ఉండే కొందరు వ్యక్తులు తమ స్థలం వక్ఫ్‌బోర్డుదంటూ తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. వక్ఫ్ బోర్డు, జీహెచ్‌ఎంసీ ల్యాండ్ ఎక్విజేషన్ అధికారులకు వారు తప్పుడు ఫిర్యాదులు చేస్తున్నారని ఆమె పేర్కొన్నారు. రోడ్డు వైడనింగ్ ద్వారా జీహెచ్‌ఎంసీ తమకు ఇచ్చే నష్టపరిహారంలో నుంచి రూ. ఏడు లక్షలు తమకి ఇస్తే ఫిర్యాదులు వాపసు తీసుకుంటామని వారి బ్లాక్‌మెయిలింగ్, బెదరింపులకు పాల్పడుతున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై తాము కాచిగూడ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని తెలిపారు. న్యాయం చేయాలని కోరారు.

కార్మికులకు వైద్య పరీక్షలు

ముషీరాబాద్: రాష్ట్ర కార్మిక శాఖ హెల్త్ కేర్ ఆధ్వర్యంలో బుధవారం ముషీరాబాద్ ప్రభుత్వ పాఠశాల ప్రాంగణంలో కార్మికుల కోసం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. రక్త పరీక్షలు బీపీ, మాస్టర్ హెల్త్ చెకప్, కంటి పరీక్షలు, ఈసీజీ తదితర వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మిక శాఖ కోఆర్డినేటర్ ఎ.వి జయ్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ... కార్మిక శాఖ నుంచి గుర్తింపు కార్డు పొందిన అసంఘటిత కార్మికులకు మెరుగైన వైద్యం అందదించేందుకు వాడవాడలా ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ అవకాశాన్ని కార్మికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వైద్య శిబిరంలో పరీక్షలు చేయించుకున్న వారికి వారం రోజుల్లో ఉచితంగా రిపోర్టులు ఇస్తామని తెలిపారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్ సాయికుమార్, వైద్య సిబ్బంది జ్యోతి, రోహిత్, ఆకాష్ పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలతో సంతృప్తి



పేదలకు గ్రైండర్స్ పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే గణేష్‌గుప్తా

కాచిగూడ: మానవ సేవయే మాధవ సేవ అని.. సేవా కార్యక్రమాల ద్వారా మానసిక సంతృప్తి లభిస్తుందని మాజీ ఎమ్మెల్యే బీగాల గణేష్‌గుప్తా అన్నారు. వీబీజీ ఫౌండేషన్ వ్యవస్థాపకులు మడిపడిగ రాజుగుప్తా జన్మదినం సందర్భంగా బుధవారం కాచిగూడతోపాటు నగరంలోని పలు ప్రాంతాల్లో పేద ప్రజల కోసం నిర్వహించిన పలు సేవా కార్యక్రమాలను ఆయన ప్రారంభించారు. వీబీజీ ఫౌండేషన్ టీమ్ సభ్యులు ఐకమత్యంతో చేస్తున్న సామాజిక సేవాల కార్యక్రమాలు బేషుగ్గా ఉన్నాయని అభినందించారు. ఈ సందర్భంగా రూ. లక్షల విలువ చేసే వికలాంగులకు వీల్ చైర్లు, ఒంటరి మహిళలకు కుట్టు మిషన్లు, నిరుపేదలకు బట్టలు, విద్యార్థులకు స్కాలర్‌షిప్పులు, పుస్తకాలు, స్కూల్ ఫీజులు, పేద మహిళలు వ్యాపారం చేసుకోవడానికి గ్రైండర్స్ అందజేశారు. వేల మందికి అన్నదానం చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన రక్తదాన శిబిరంలో పలువురు రక్తదానం చేశారు. కార్యక్రమంలో బీజేపీ నేత చీకోటి ప్రవీణ్, ఎమ్మెల్సీ దయానంద్ గుప్తా, ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కాల్వ సుజాత, బండారు సుబ్బారావు, టీఎస్‌వీ ప్రసాద్, ఇమ్మడి రమేష్, రాజేష్, బొగ్గరి శివ, తెలంగాణ, ఏపీ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన వీబీజీ ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొని పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు.

నీటిని వృథా చేస్తే జరిమానా



నర్సింహ బస్తీలో రోడ్డుపైకి వదిలిన నీటిని పరిశీలిస్తున్న ఏఎంవోహెచ్ హేమలత

నల్లకుంట: ఓ వైపు నీటి అవసరాలు పెరుగుతుండటం, మరోవైపు ఏటా జలవనరులు తగ్గిపోతున్న క్రమంలో ప్రజలు నీటిని పొదుపుగా వాడుకోవాలని, లేదంటే భవిష్యత్ తరాలకు ఇబ్బందులు తప్పవని జీహెచ్‌ఎంసీ ఏఎంవోహెచ్ డాక్టర్ హేమలత హెచ్చరించారు. కుళాయిల ద్వారా సరఫరా అయ్యే తాగు నీటితో పాటు బోర్ నీటిని కొందరు నిర్లక్ష్యంగా వీధుల్లోకి వదులుతున్నారని, అలా చేస్తే ఉపేక్షించేది లేదని ఆమె హెచ్చరించారు. బుధవారం నల్లకుంట డివిజన్ పరిధిలోని నర్సింహబస్తీలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఓ ఇంట్లో నుంచి కుళాయి నీటిని రోడ్డుపైకి వదలడం గమనించిన ఏఎంవోహెచ్ అక్కడికి వెళ్లి ఆ ఇంటి యజమానికి రూ. 3 వేల ఫైన్ వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తాగు నీటిని జాగ్రత్తగా వాడుకోవాల్సిన సమయంలో అంబర్‌పేట నియోజక వర్గంలోని చాలా బస్తీలు, కాలనీలలో కొందరు నిర్లక్ష్యంగా నీటిని వీధుల్లోకి వదులుతున్నారన్నారు. నీటిని వృథాగా రోడ్లపైకి వదిలితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ప్రజలకు కావాల్సిన స్థాయిలో జలమండలి మంచి నీటిని అందిస్తుందని, కొన్ని కాలనీలు, బస్తీలలో మంచి నీటిని రోడ్లపకి వదిలి వృథా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంట్లో ఉన్న కుళాయిల నీటిని తగినంత వాడుకుని కట్టేస్తే సరిపోతుందన్నారు. చాలా మంది అలా చేయడంలేదని, ఈ కారణంగా నీటి వృథా పెరిగిపోతోందని, అలాగే వీధులు అపరిశుభ్రంగా మారుతున్నాయన్నారు. ప్రతి ఒక్కరూ నీటిని పొదుపుగా వాడుకోవాలని సూచించారు.

స్వచ్ఛందంగా మొక్కలు నాటాలి



మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

అంబర్‌పేట: పర్యావరణాన్ని పరిరక్షించడంలో ప్రతి ఒక్కరూ మొక్కల ప్రాముఖ్యతను గుర్తించాలని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తెలిపారు. బుధవారం బాగ్ అంబర్‌పేటలోని ఆడ్వాన్స్ ట్రైనింగ్ సెంటర్ ఆవరణలో చేపట్టిన హరితహారం కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ బి.పద్మా వెంకట్‌రెడ్డితో కలిసి హాజరయ్యారు. అనంతరం అక్కడ మొక్కలు నాటి వాటికి నీరు పోశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... వర్షాకాలం పూర్తియ్యేలోపు నియోజకవర్గం విస్తృతంగా మొక్కలు నాటేందుకు చొరువ తీసుకుంటానన్నారు. స్వచ్ఛందంగా ప్రజలు మొక్కలు నాటడంపై ఆసక్తి పెంచుకోవాలన్నారు. బీఆర్ఎస్ సీనియర్ నాయకులు బి.వెంకట్‌రెడ్డి, అర్బన్ బైయో డైవర్సిటీ డైరెక్టర్ శ్రీనివాస్‌రావు, డిప్యూటీ డైరెక్టర్ రాజ్‌కుమార్, మేనేజర్ రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

స్రవంతికి నివాళి

కవాడిగూడ: బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, బీజేపీ సీనియర్ నేత డి.శ్రీనివాస్ ముదిరాజ్ కూతురు స్రవంతి(21) మంగళవారం రాత్రి మోహిదీపట్నంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందింది. స్రవంతి మృతి దేహానికి ఉస్మానియా ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం బుధవారం దోమలగూడలోని డి.శ్రీనివాస్ నివాసానికి స్రవంతి మృతదేహాన్ని తీసుకువచ్చారు. స్రవంతి మృతదేహాన్ని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు ఎంపీ డాక్టర్ కె. లక్ష్మణ్, కవాడిగూడ కార్పొరేటర్ జి.రచనశ్రీ, మాజీ కార్పొరేటర్ టి.రవీందర్, బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యులు పూసరాజు, ఓబీసీ మోర్చా నగర అధ్యక్షుడు సలంద్రి శ్రీనివాస్ యాదవ్, బస్తీ నేతలు పాల్గొని నివాళులర్పించారు. అనంతరం దోమలగూడ హిందూ శ్మశానవాటికలో స్రవంతి అంత్యక్రియలు నిర్వహించారు.

నిబంధనలు పాటించని విద్యాసంస్థలపై చర్యలు తీసుకోండి

ముషీరాబాద్: రాష్ట్ర వ్యాప్తంగా ప్రైవేటు విద్యా సంస్థలు నియమనిబంధనలు పాటించకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయని తెలంగాణ బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కట్ట బబ్లూగౌడ్ అన్నారు. బుధవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... కనీస మార్గదర్శకాలు పాటించకుండా జీవో 1ని తుంగలో తొక్కుతూ అధిక ఫీజులు, పుస్తకాలు, యూనిఫాంల పేరిట వ్యాపారాలు కొనసాగిస్తున్నాయన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన వివిధ నిబంధనలను పాటించకుండా అనేక పాఠశాలల యాజమాన్యలు వ్యవహరిస్తున్నా సంబంధిత విద్యాశాఖ అధికారులు మాత్రం చేపేష్టలుడిగి చూస్తున్నారన్నారు. కనీస నిబంధనలను పాటించకుండా నిర్ణీతవసతులు కల్పించకుండా స్థాపించిన పాఠశాలల్లో ఫీజులు మాత్రం లక్షల్లో ఉంటున్నాయన్నారు. వెంటనే అధికారులు ఇలాంటి పాఠశాలలను గుర్తించి యాజమాన్యలపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

సెల్‌ఫోన్ దొంగిలించి.. డబ్బులు కాజేసి...

కాచిగూడ: దొంగిలించిన సెల్‌ఫోన్ నుంచి గుర్తుతెలియని వ్యక్తి డబ్బులు కాజేసిన సంఘటన కాచిగూడ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే ఇన్‌స్పెక్టర్ ఆర్.ఎల్లప్ప సమాచారం మేరకు... సరూర్‌నగర్‌కు చెందిన విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగి భగవతి ఈ నెల 5వ తేదీన నెల్లూరు వెళ్లడానికి కాచిగూడ రైల్వే స్టేషన్‌కు వచ్చాడు. ప్లాట్‌ఫారంపై అతని సెల్‌ఫోన్ చోరీకి గురైంది. అతని ఫోన్‌లోని ఫోన్ పే నుంచి గుర్తుతెలియని వ్యక్తి రూ. 1.15 లక్షల నగదును దొంగిలించాడు. ఈ మేరకు బుధవారం బాధితుడు కాచిగూడ రైల్వే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

దాడిలో యువకుడికి గాయాలు

దుండగుల దాడిలో ఓ యువకుడు గాయపడిన సంఘటన కాచిగూడ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో జరింగి రైల్వే ఇన్‌స్పెక్టర్ ఆర్. ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం... ఉప్పుగూడకు చెందిన వి.హెచ్.ప్రభుదేవా(27)ను బుధవారం ఉప్పుగూడ రైల్వే స్టేషన్‌లో గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. బాధితుడిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు. తల్లి మంజుల ఫిర్యాదు మేరకు రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నగదు, ఐఫోన్ బ్యాగు చోరీపై జీరో ఎఫ్ఐఆర్...

నగదు, ఐఫోన్ బ్యాగు చోరీపై కాచిగూడ రైల్వే పోలీసులు జీరో ఎఫ్ఐఆర్ చేశారు. రైల్వే ఇన్‌స్పెక్టర్ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం... అఫ్జల్‌గంజ్ ప్రాంతానికి చెందిన రాకేష్ పటేల్ మంగళవారం అహ్మదాబాద్ నుంచి కాచిగూడకు రైలులో వస్తున్నాడు. నాందేడ్ స్టేషన్ వద్ద చూసుకోగా రూ. 20 వేలు, ఐఫోన్ ఉన్న బ్యాగు కనబడలేదు. బుధవారం బాధితుడి ఫిర్యాదు మేరకు కేసును నమోదు చేసి నాందేడ్ రైల్వే పోలీసులకు బదిలీ చేశారు.

ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌లో భారీ అగ్నిప్రమాదం

- రెండు గంటల పాటు ట్రాఫిక్ జామ్
- తప్పిన పెను ప్రమాదం
- ఐదు ఫైర్ ఇంజన్‌లతో మంటలు ఆర్పిన సిబ్బంది



ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌లోని దత్తసాయి కాంప్లెక్స్‌లో చెలరేగుతున్న మంటలు



మంటలు ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌లోని శ్రీ దత్తసాయి కాంపెన్స్‌లో బుధవారం రాత్రి భారీ అగ్నిప్రమాదం సంభవించింది. కాంప్లెక్స్‌లోని రెండవ అంతస్తులో ఉన్న ఫ్లాట్ నెంబర్ 202లో ఉన్న టప్పర్ వేర్ గోదామ్‌లో ప్రమాదవశాత్తు మంటలు చెలరేగాయి. ఆ గోదామ్‌లో ప్లాస్టిక్ ఐటమ్స్‌తో ఒకసారిగా మంటలు ఎగసి పడటంతో ఆ ప్రాంతమంతా మంటలు, పొగతో నిండిపోయింది. దీంతో ఆ కాంప్లెక్స్‌లో ఉన్న వారు భయభ్రాంతులకు గురై పరుగులు తీసి సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లారు. సమాచారం అందుకున్న ముషీరాబాద్ ఫైర్ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని మంటలను అదుపులోకి తీసుకురావడానికి తీవ్రంగా ప్రయత్నించారు.

- ముషీరాబాద్, బేగంపేట ప్రాంతాలకు చెందిన ఐదు ఫైర్ ఇంజన్‌లు సంఘటన స్థలానికి చేరుకొని మంటలను అదుపులోకి తేవడానికి ప్రయత్నించారు. అగ్నిప్రమాదం సంఘటన జరిగిన ప్రాంతానికి కొద్ది దూరంలో ఉన్న ఆస్పత్రిలోని రోగులకు ఎటువంటి ప్రమాదం జరగకుండా ఉండేందుకు ముందస్తుగానే సురక్షిత ప్రాంతానికి తరలించారు.
- చిక్కడపల్లి ఏసీపీ ఎల్.రమేష్‌కుమార్, ఇన్‌స్పెక్టర్ ఏరుకొండ సీతయ్య, ముషీరాబాద్ ఇన్‌స్పెక్టర్ నిరంజన్, ట్రాఫిక్ డీసీపీ అశోక్‌కుమార్‌లు ఫైర్ సిబ్బందితో కలిసి ఆ ప్రాంతానికి చేరుకొని మంటలను అదుపు చేయడానికి కృషి చేశారు.

తప్పిన పెను ప్రమాదం...

ఆర్టీసీ క్రాస్ రోడ్‌లో జరిగిన అగ్ని ప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో ఇటూ పోలీసులు, స్థానికులు, ఫైర్ సిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు. ప్రాథమిక అంచనా ప్రకారం సుమారు రూ. ఐదు లక్షల వరకు ఆస్తినష్టం జరిగిందని అంచనా.

రెండు గంటల పాటు ట్రాఫిక్ జామ్...

ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌లోని దత్తసాయి కాంప్లెక్స్‌లో టప్పర్‌వేర్ కంపెనీలో జరిగిన అగ్ని ప్రమాదం కారణంగా ఆయా ప్రాంతాల్లో మంటలు చెలరేగడంతో సుమారు గంటల పాటు ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. ట్రాఫిక్ సిబ్బంది, లా అండ్ ఆర్డర్ పోలీసులు ట్రాఫిక్ జామ్‌ను నియంత్రించి వాహనాదారులను సురక్షితంగా పంపించారు.



మెట్రో స్టేషన్ నుంచి అగ్నిప్రమాదాన్ని చూస్తున్న ప్రజలు